


## విత్తన డీలర్ షాపులో తనిఖీలు




జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతి అక్షరం- ప్రజల కోసం

## నిజామాబాద్

శనివారం 1 జూన్ 2024 పేజీలు 8



# రోగుల నిలువు దోపిడీ

వైద్య పరీక్షల పేరిట ప్రైవేట్ దయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారు. వారు చెప్పిందే రేటు అన్నట్టుగా చెల్లించాల్సి వస్తుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. వైద్యుడి మాటను కాదని.. మరో చోట పరీక్షలు చేయించుకునే ధైర్యం లేక ప్రైవేట్ దయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు పెట్టిన ఫీజును చెల్లించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనంతటికీ వైద్యులు, సెంటర్ల నిర్వాహకుల మధ్య జరిగే కమీషన్ల వ్యవహారమే కారణమన్నది జగమెరిగిన సత్యం.

మిగతా 3లో...

## జీరో బిల్లులపై సూర్య ప్రతాపం

### పెరిగిన విద్యుత్ వినియోగంతో తగ్గిన గృహజ్యోతి లబ్ధిదారులు

నిజామాబాద్ మే 31:
విద్యుత్ జీరో బిల్లుల లబ్ధిదారులపై వేసవి ప్రతాపం చూపింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన గృహ కనెక్షన్లకు విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పేరిట మూడు నెలలుగా రద్దు చేస్తోంది. దీంతో జిల్లాలో సుమారు 1.25లక్షల మంది గృహ వినియోగదారులకు నెలవారీగా సుమారు రూ.3.80కోట్ల విద్యుత్ బిల్లుల భారం తప్పుతున్నది. ప్రభు త్వం 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులను రద్దు చేస్తు న్నా, మూడు నెలలుగా పెరుగుతున్న వేసవి తీవ్రతతో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరగడంతో విద్యుత్ వినియోగం కూడా అధికమైంది. దీంతో పలువురు 200 యూనిట్ల మార్క్‌ను దాటడంతో గృహజ్యోతి లబ్ధిని కోల్పో యి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారు. అయితే వేసవి తీవ్రత మరింత పెరిగిన నేపథ్యంలో జూన్ బిల్లులో కూడా జీరో బిల్లులు మరిన్ని తగ్గే అవకాశాలు ఉంటాయని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

**తగ్గిన జీరో బిల్లులు**

యాదాద్రి జిల్లాలో గృహ (క్యాటగిరీ-1) సర్వీసులు మే నాటికి 2,71,260 ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, 200 యూనిట్ల పైబడి విద్యుత్ వా డే వినియోగదారులు




పోగా, 1,29,603 మందిని గృహజ్యోతి లబ్ధిదారులుగా గుర్తించారు. ఈ మేరకు మార్చిలో 1,27, 756 మందికి గృహజ్యోతి వర్తించగా, వేసవి తీవ్రత కారణంగా మే నాటికి 3,851 మంది గృహజ్యోతి లబ్ధికి దూరమయ్యారు. అదే సమయంలో...

మిగతా 3లో...

# రేషన్ కార్డులకు మోక్షమేప్పుడో

**నిరుపేదలకు అందని ద్రాక్షగా మారిన రేషన్ కార్డులు- రేషన్ కార్డులు అందక ప్రజలకు తప్పని ఇబ్బందులు**



**రుద్రూర్, మే31 (ప్రజా జ్యోతి) :** రేషన్ కార్డ్ అంటే ఒక్క రేషన్ కు మాత్రమే పని చేయదు. మధ్యతరగతి కుటుంబాలకి ఏ పథకానికి అయినా రేషన్ కార్డు తప్పనిసరి. అలాంటిది ఏళ్లకు ఏళ్ళు గడుస్తున్నా నిరుపేదలకు రేషన్ కార్డుల పంపిణీకి ముందుకు రావడంలేదు. దీంతో కొత్తగా పెళ్లయిన వారికి నాన ఇబ్బందుల పాలవుతున్నారు. ఉన్న రేషన్ లో నుండి తీసివేయడం, కొత్తవి ఇవ్వకపోవడం ఇలా ఇంకెన్నాళ్ళు అంటూ ప్రజలు వాపోతున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లాలో 30,179 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఆమోదించినవి 12, 441, తిరస్కరించినవి. 1,322, పెండింగ్. ఎంఆర్వో దరఖాస్తులు 736, పెండింగ్ డీఎస్వో అర్జీలు 8,125, కుటుంబ సభ్యులను చేర్చేందుకు 7,555 వచ్చాయి.వీటిపై తహసీల్దార్ లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. వివరాలను డీఎస్వో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయినా ఇంతవరకు కార్డులు అందలేదు. జిల్లాలో 413 రేషన్ దుకాణాలు, 2,17,266 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో అంత్యోదయ 12,396, తెల్ల రేషన్ 2,04,687, అన్నపూర్ణ కార్డులు 193 ఉన్నాయి. ఈ లబ్ధిదారులకు ప్రతినెలా రేషన్ దుకాణాల ద్వారా 3,500 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

**- రేషన్ కార్డులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత బియ్యం కోల్పోవడంతోపాటు పలు రకాల సంక్షేమ పథకాలు వారికి దక్కడం లేదు. కార్డులో మార్పులు చేర్పులకు సైతం అవకాశం లేదు. పిల్లలు జన్మిస్తే వారి పేర్లు నమోదు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం 2016లో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అవి అరకొరగానే వచ్చాయి. ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి ఇంకా ఇవ్వలేదు. కార్డులో పేరుండి చనిపోతే ఆన్‌లైన్ దరఖాస్తు చేయగానే వెంటనే తొలగిస్తున్నారు. కానీ కొత్తగా 7,555 మంది పేర్లు చేర్చాలని వచ్చిన అర్జీలపై ఇప్పటివరకు కదలిక లేదు.కొత్తగా పెళ్లయిన వారు, కొత్తగా పుట్టిన పిల్లల పేర్లను చేర్చాలని కోరితే అవకాశమే ఇవ్వడం లేదు. కొత్త కార్డులు కావాలంటే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. గతేడాది నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. కొత్త కార్డులతోపాటు మార్పులు చేర్పులు, పేర్ల నమోదుకు అవకాశం లేకుండా చేసింది. విషయం తెలియక చాలామంది మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంజూరు చేస్తారన్న ఆశతో ఉన్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి. కార్డు లేకపోవడంతో చాలామంది రేషన్ సరుకులు పొందలేక పోతున్నారు. పాత కార్డుల్లో పిల్లలను చేర్చాలి. ఈ విషయాలను అధికారులకు అడిగితే స్పందించడలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వెంటనే రేషన్ కార్డులను అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు



**సిరికొండ, మే 31 (ప్రజా జ్యోతి) శ్రీనివాస్:** లైసెన్సు కలిగిన ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని స్థానిక తహసిల్దార్ రవీందర్ రావు అన్నారు.నకిలీ విత్తనాల తనిఖీలోభాగంగా మండలంలోని సిరికొండ మరియు కొండూరు గ్రామాలలో మండల టాస్క్ ఫోర్స్ టీం తాసిల్దార్ రవీందర్ రావు ఏఎస్ఐ బాల్ సింగ్ ,మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ లు తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా విత్తనాలు అమ్ముతున్న ప్రైవేట్ డీలర్ దుకాణాల లో విక్రయిస్తున్న విత్తనాలను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ.... రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయి చాలని ఆదేశించడం జరిగింది. రైతులు అధికృత డీలర్ల నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని, గ్రామాలలో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించిన వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. నకిలీ విత్తనాలు అమ్మితే వారి పైన చట్టపరమైన కేసులు విధించబడతాయని కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టారు వదిలి పెట్టారు

**- ఆగని అక్రమ చెరువు మట్టి రవాణా**



**రుద్రూర్, మే 31 (ప్రజా జ్యోతి) :** రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి గ్రామ చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా అంబం గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ భూమిలోకి ఎలాంటి అనుమతి లేకుండా చెరువులోని మట్టిని ట్రాక్టర్లలో అర్ధ రాత్రి సమయంలో యాథేచ్చగా తరలిస్తున్నారు. నిన్న కూడా చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకుని తహసీల్దార్ కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఒక జేసిబి, ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అవేమీ పట్టనట్లుగా మళ్లీ యాథేచ్చగా అర్ధ రాత్రి సమయంలో చెరువులోని మట్టిని తరలించారని గ్రామస్తులు వాపోయారు. పట్టారు... వదిలి పెట్టారు అన్న చందంగా మారింది ఈ వ్యవహార తీరు అని గ్రామస్తులు ప్రశ్నించుకుంటున్నారు.

## ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సిరికొండ, మే 31 (ప్రజా జ్యోతి) శ్రీనివాస్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఉన్నత విద్య మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాబోధన చేయుటకు ఒప్పంద ఉద్యోగం గంటల ప్రాతిపదికన పనిచేయుటకు పీజీ,బీఎడ్ విద్యార్హత కలిగిన పిజిటి భౌతిక శాస్త్రం మరియు రసాయన శాస్త్రం సంబంధించిన అభ్యర్థుల నుండి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటన లో తెలియజేశారు. దరఖాస్తు చేయదలచిన వారు జూన్ 05వ తేదీ లోపు ఆదర్శ పాఠశాలలో సంప్రదించగలరని తెలిపారు. మరిన్ని వివరాలకై ఈ క్రింద తెలిపిన మొబైల్ నెంబర్లో సంప్రదించగలరని కోరారు .9866665604

## పొగాకు భారీ నుండి ప్రాణాలను రక్షించుకుందాం



రెంజల్ ప్రజా జ్యోతి మే 31: పొగాకు నుంచి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రాణాలను రక్షించుకుందామని వైద్య అధికారిని ప్రమోదిత అన్నారు. రెంజల్ మండలంలోని కూనేపల్లి, వీరన్న గుట్ట సబ్ సెంటర్లలో పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నికోటిన్ ఉత్పత్తులు వినియోగం పెరగడంతో ఆందోళన కలిగిస్తున్నాయ న్నారు. వ్యసన పరులుగా మాలకముందే మానిపించేందుకు కృషి చేయాలి అన్నారు. ముఖ్యంగా పొగాకుతో శ్వాసకోశ వ్యాధులు, గుండె వ్యాధులు, క్యాన్సర్, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వీటి పట్ల జాగ్రత్తగా వహించాలన్నారు. పొగాకు రహిత సమాజం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, పంచాయతీ కార్యదర్శులు శివకృష్ణ, వెంకటరమణ రాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

## చిన్నారుల్లో పోషకాహారం లోపం లేకుండా చూడాలి



**రెంజల్ ప్రజా జ్యోతి మే 31 :** అంగన్వాడి కేంద్ర పరిధిలో గల చిన్నారులో పోషకాహారం లోపం లేకుండా చర్యలను చేపట్టాలని సిడిపిఓ జానకి అన్నారు. శుక్రవారం రెంజల్ మండల కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని సూపర్వైజర్ ప్రమీల రాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడిలోకి నూతనంగా వచ్చిన చిన్నారులకు పోషక ఆహారం లోపాలు లేకుండా ప్రభుత్వ అందిస్తున్న ఆహారాన్ని అందించాలన్నారు. వారి యొక్క బరువు కొలతలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. అంగన్వాడిలో పాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రెండు ఒకటిన్నర సంవత్సరాల అంగన్వాడిలో చేర్పుకొని, అర్హత కలిగిన విద్యార్థులకు ప్రైమరీ పాఠశాలలో నమోదు చేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించి, న్యూట్రిషన్ గార్డెన్ లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోషణ అభియాన్ డైరెక్టర్ రాంబాబు, అంగన్వాడి కార్యకర్తలు ఉన్నారు.

## కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

**రెంజల్ ప్రజా జ్యోతి మే 31 :** కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఈ సాయన్న తెలిపారు. ఆయన కథనం మేరకు రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన ఆకుల మహేష్ 29 సంవత్సరాల యువకుడు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి ఆకుల చిన్న సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. యువకుడు గత కొన్ని సంవత్సరాల నుండి కడుపునొప్పి బాధపడుతున్నాడని, మద్యానికి బానిసై, నొప్పి భరించలేక గ్రామ శివారులోని చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి

## విత్తన డీలర్ షాపులో తనిఖీలు



**రుద్రూర్, మే 31 (ప్రజా జ్యోతి):** ఖరీఫ్ సీజన్ పురస్కరించుకొని రైతన్నలు విత్తనాలు వేసే సమయంలో నకిలీ విత్తనాలను నియంత్రణలో భాగంగా శుక్రవారం రుద్రూర్ మండల కేంద్రంలోని విత్తన డీలర్ల షాపులపై వ్యవసాయ పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపులలో ఉన్న విత్తనాలను పరిశీలించారు. విత్తనాలు కొన్న రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని వారు డీలర్లకు తెలియజేశారు. నకిలీ విత్తనాలను నియంత్రించే క్రమంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వాళ్ళు తెలిపారు. ఈ తనిఖీల్లో రుద్రూర్ తహసిల్దార్ వెంకటేశం, ఎస్సై అప్పారావు, ఏ ఈ నగేష్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## పశు వైద్యశాల ఆకస్మిక తనిఖీ



**మాక్లూర్,ప్రజాజ్యోతి,మే 31:** మండల కేంద్రంలోని పశు వైద్యశాలను నిజామాబాద్ జిల్లా పశు వైద్యాధికారి జగన్నాథ చారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలని సూచించారు.పశువులకు గడ్డి కొరత లేకుండా పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.పశువులకు అందిస్తున్న వైద్య సేవలు మందుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని,పశువైద్యశాలకు క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని తెలిపారు.అందుబాటులో ఉండి పశువులకు వైద్య సేవలను అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి,మండల పశు వైద్యాధికారులు కిరణ్ దేశ్ పాండే,ఉమామ సాహెర్,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# రోగుల నిలువు దోపిడీ

**- స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్ల దందా - వైద్య పరీక్షల పేరిట ఇష్టారాజ్యం**

**- టెస్టులకు వాళ్లు పెట్టిందే రేటు - గుట్టుగా సాగుతున్న లింగ నిర్ధారణ, అబార్షన్లు**

**- జాడలేని టాస్క్‌ఫోర్స్ - మామూళ్ల మత్తులో వైద్య, ఆరోగ్యశాఖ**

నిజామాబాద్, మే 31 : వైద్య పరీక్షల పేరిట ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారు. వారు చెప్పిందే రేటు అన్నట్టుగా చెల్లించాల్సి వస్తుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. వైద్యుడి మాటను కాదని.. మరో చోట పరీక్షలు చేయించుకునే ధైర్యం లేక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు పెట్టిన ఫీజును చెల్లించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనంతటికీ వైద్యులు, సెంటర్ల నిర్వాహకుల మధ్య జరిగే కమీషన్ల వ్యవహారమే కారణమన్నది జగమెరిగిన సత్యం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో జరుగుతున్న డయాగ్నస్టిక్, స్కానింగ్ కేంద్రాల దోపిడీపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

**పుట్టుకొస్తున్న డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరంలోనే లెక్కలేనన్ని డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి. ఇవన్నీ ప్రస్తుతం రోగులను పీల్చిపిప్పిచేసే కేంద్రాలుగా మారాయి. తమ లాభాలతోపాటు దళారులకు, రిఫరల్ వైద్యులకు ఇవ్వాల్సిన కమీషన్లను కూడా రోగి నుంచి వసూలు చేస్తున్నారు. దళారీ వ్యవస్థను పెంచి పోషిస్తూ రోగులకు అవసరం లేకపోయినా ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఈఈజీ లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగుల నుంచి వీరు వసూలు చేసే సొమ్ములో 50శాతం కమీషన్లు దళారులకు, రిఫరల్ వైద్యులకు చెల్లిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే ఈ కేంద్రాల్లో పరీక్షల నాణ్యతా ప్రమాణాలు కూడా అంతంత మాత్రమే ఉంటున్నాయని రోగులు వాపోతున్నారు. గుర్తింపు పొందిన సెంటర్లతోపాటు గుర్తింపు లేని సెంటర్లు కూడా వైద్య పరీక్షలు చేస్తున్నా వైద్యఆరోగ్య శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?**

గుర్తింపులేని సంస్థలతోపాటు అధిక ధరలు వసూలు చేస్తున్న స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లను గుర్తించేందుకు నియమించిన టాస్క్‌ఫోర్స్ ఎక్కడా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నగరంలో విచ్చలవిడిగా దోపిడీ జరుగుతున్నా మౌనంగా ఉండటం వెనుక మర్మమేమిటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యుల పక్షాన నిలబడాల్సిన టాస్క్‌ఫోర్స్ దళారులకు అండగా ఉంటుందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

**యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు**

పలు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి లింగ యథేచ్ఛగా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం కఠిన నిబంధనలు రూపొందించినా లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, పరీక్షలు చేయించుకుంటున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారని సమాచారం. ఈ పరీక్షలు చేసేందుకు ఆర్ఎంపీ లు, పీఎంపీలు సహకరిస్తున్నారని.. ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ. 15వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం అవసరమైతే అబార్షన్లు కూడా చేస్తున్నారని సమాచారం. నగరంలోని కాకాజీ కాలనీ, రాంనగర్, డబ్బాల జంక్షన్, కాశీబుగ్గ, బాల సముద్రం, కాజీపేటలో పలు డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లలో ఈ తతంగం నిత్య కృత్యంగా మారింది. గతంలోనే పలుసందర్భాల్లో వెలుగులోకి వచ్చినా.. మళ్లీ కొత్త సెంటర్లు పుట్టుకొస్తుండటంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

**మామూళ్ల మత్తులో ఆరోగ్యశాఖ**

ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల పనితీరుపై నిరంతరం నిఘా పెట్టాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని, ఆయా సెంటర్ల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి కళ్లు మూసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లపై నాణ్యత ధరల విషయంలో నిరంతరం తనిఖీలు చేయకుండా మౌనంగా ఉండటం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అబార్షన్లు చేస్తున్నారని వచ్చిన సమాచారంతో పలు సెంటర్లపై దాడులు చేసిన అధికారులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని, చట్టాలను పకడ్బందీగా అమలు చేసి నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఆయా సెంటర్ల నిర్వాహకులపై నిఘా పెట్టి.. పటిష్ట చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పట్టుబడినా శిక్షలు లేవు..**

గతేడాది మార్చి 23వ తేదీన వరంగల్ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో మొబైల్ స్కానింగ్ మిషన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అలాగే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి.. ఓ వైద్యురాలు, నర్సుపై కేసులు నమోదు చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. ఇదే తరహాలో హనుమకొండ కాకాజీకాలనీ ప్రాంతంలో కూడా లింగ నిర్ధారణ కోసం స్కానింగ్‌లు నిర్వహిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు కేసులు నమోదు చేశారు. కానీ ఇలా పట్టుబడుతున్న వారికి శిక్షలు పడకపోతుండటంతో.. ఆయా ఘటనల్లో దొరికిన వారు తిరిగి ఇదే దందాను మరోచోట నిర్వహిస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ తనిఖీల్లో వెల్లడవుతోంది. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ దోపిడీకి అంతం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# జీరో బిల్లులపై సూర్య ప్రతాపం

(మొదటిపేజీ తరువాయి)

రూ.74,69,317 విద్యుత్ బిల్లు లు చెల్లించారు. దీంతో ఎండాకాలం ముగింపు కోసం గృహజ్యోతి లబ్దిదారులు ఎదురుచూస్తుండటం గమనార్హం. సూ ర్యాపేట జిల్లాలో 1,59,027 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, మా ర్చి నెలలో 1,54,240 కనెక్షన్లకు జీరో బిల్లులు రాగా, ఏప్రిల్ నెలలో 1,51,290 కనెక్షన్లకు జీరో బిల్లులు వచ్చాయి. ఒక నెల తేడాతో 2,950 మంది జీరో బిల్లుకు దూరమయ్యారు.

**ఎన్నికల కోడ్ ముగిశాక**

**గృహజ్యోతి దరఖాస్తులను స్వీకరిస్తారా?**

గృహజ్యోతి లబ్ధి కోసం ఆశావహులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన వడపోతలో జిల్లాలో గృహజ్యోతికి 1,29,603 విద్యుత్ సర్వీసుదారులను ట్రాన్స్‌కో యంత్రాంగం అర్హులుగా గుర్తించింది. కానీ, ఎంపికలో పలు తప్పిదాలు జరిగాయని, పలువురు అర్హులు ఎంపిక కాలేదని వాదనలు వెల్లువెత్తడంతోపాటు ఆందోళనలకు కూడా దిగారు. దీంతో ప్రభుత్వం అప్పట్లోనే అర్హుల నుంచి మరోమారు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు ఆశావహులతో కిక్కిరిశాయి. ఇలోగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తుల పరిశీలన, నూతన దరఖాస్తుల ప్రక్రియ నిలిచింది. జూన్ 6తో ఎన్నికలకోడ్ ముగిసిన వెంటనే గృహజ్యోతి దరఖాస్తుల ప్రక్రియను పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు.